క్లుప్తంగా

ఇద్దరిపై కేసులు నమోదు

కొమరోలు: మాటామటా అనుకుని దాడి చేసుకున్న నేపథ్యంలో శుక్రవారం ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు కొమరోలు స్టేషన్ హౌస్ ఆఫీసర్ నారాయణ తెలిపారు. కొమరోలులోని చెక్‌పోస్టు సమీపంలోని ఓ టీస్టాల్ వద్ద గురువారం ఆదినారాయణ, వెంకటేశ్వర్లు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు, మరో వ్యక్తి కలిసి తనపై రాయితో దాడి చేసినట్లు ఆదినారాయణ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేశారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన షెక్షావలి

కొమరోలు: ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడటంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈసంఘటన మండలంలోని ముక్తాపురం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలోని రెడ్డిచెర్ల గ్రామానికి చెందిన షెక్షావలి అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై గిద్దలూరు వెళ్తుండగా ముక్తాపురం గ్రామంలో రహదారికి అడ్డుగా పోసిన కంకరలో జారిపడటంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుడికి ఎడమ కాలు విరిగినట్లు బంధువులు తెలిపారు.

ఎస్టీయూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



ఎస్టీయూ క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న సభ్యులు

తర్లుపాడు: ఎస్టీయూ నూతన సంవత్సర క్యాలండర్, డైరీని శుక్రవారం కలుజువ్వలపాడు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సత్యనారాయణ ఆవిష్కరించారు. ఉపాధ్యాయులందరికీ యూనియన్ మండల అధ్యక్షుడు జగన్‌బాబు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి అంజనీకుమార్, ఉపాధ్యక్షుడు బండి రాజారమేష్, చినమనకొండ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు గరికపాటి ఆదినారాయణ, రంగయ్య, నంద్యాల కాశయ్య, సురేంద్ర పాల్గొన్నారు.

చెన్నకేశవ స్వామి హుండీ ఆదాయం రూ.5.85 లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

మార్కాపురం టౌన్: మార్కాపురంలోని శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో హుండీ కానుకల ద్వారా రూ.5.85 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈవో జి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మూడు నెలల పది రోజుల వ్యవధిలో హుండీల్లో వేసిన కానుకలను శుక్రవారం లెక్కించగా రూ.5,85,374 వచ్చాయని పేర్కొన్నారు. చెన్నకేశవ స్వామి హుండీ ద్వారా 5,79,413, ప్రసన్న ఆంజనేయ స్వామి హుండీ ద్వారా రూ.5,961 వచ్చినట్లు వివరించారు. హుండీల లెక్కింపులో ఆలయ సిబ్బంది, మహిళా భక్తులు పాల్గొన్నారు.



మార్కాపురం–తర్లుపాడు రోడ్డు పరిస్థితి ఇదీ..



మార్కాపురం అలుగువద్ద రోడ్డు దుస్థితి

యథా రోడ్డు.. తథా సమస్య!

- అధ్వానంగా రహదారులు.. వాహనదారులకు తప్పని తిప్పలు
- మార్కాపురం చెరువుకట్ట రోడ్డు గుంతలమయం
- వర్షానికి కొట్టుకుపోయిన గుంతల్లో నింపిన మట్టి
- రాకపోకలకు అనుకూలంగా పట్టణ శివారులోని ఆర్‌అండ్‌బీ రోడ్లు
- మార్కాపురం–తర్లుపాడు రోడ్డులోనూ ప్రయాణికులకు చుక్కలు



చెరువుకట్టకు వెళ్లే క్రమంలో గుంతలుపడిన రోడ్డు



మార్కాపురం జీపుస్టాండ్ వద్ద గుంతలు పడినరోడ్డు

మార్కాపురం:

కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు ముగుస్తున్నా దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేయకుండా పాలకులు చోద్యం చూస్తున్నారు. నిత్యం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై బురద జల్లేందుకే శ్రద్ధ చూపిస్తున్న అధికార టీడీపీ ప్రజాప్రతినిధులు.. ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్ల సమస్యను పరిష్కరించడంలో మాత్రం ఘోరంగా విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే మార్కాపురం చెరువు కట్ట రోడ్డు, మార్కాపురం–తర్లుపాడు రోడ్ల మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు యాతన పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మార్కాపురం చెరువు కట్ట రోడ్డుపై రోజూ వందకు పైగా బస్సులు, 500కు పైగా ఆటోలు, 1000కి పైగా టూవీలర్లు, అంతే సంఖ్యలో కార్లు ప్రయాణిస్తుంటాయి. జిల్లా కేంద్రమైన ఒంగోలు, మార్కాపురం రైల్వేస్టేషన్, మరో 15 గ్రామాలకు వెళ్లాలంటే ఈ రోడ్డే ఆధారం. అయితే చెరువు అలుగు, జీపు స్టాండ్, చెరువు కట్టపైన గుంతలు పడటంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఇటీవల చెరువు కట్టకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్లు తొలగించి గుంతల్లో తాత్కాలికంగా మట్టిపోసి మమ అనిపించారు. 10 రోజుల క్రితం కురిసిన వర్షాలకు మట్టి కొట్టుకుపోవడంతో సమస్య మొదటికొచ్చింది. మార్కాపురం పట్టణ శివారులో రహదారులు రాకపోకలకు అనువుగా లేకపోవడంతో వాహనదారులకు సంకటంగా మారింది. ఇటీవలే ఆర్టీసీ బస్సు మార్కాపురం నుంచి ఒంగోలు వెళ్తూ రోడ్డు పక్కనే ఉన్న నీళ్ల సంపు కల్వర్ట్‌ను ఢీకొంది. వారం రోజుల క్రితం ఆటో–టూవీలర్ ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. ఇలా ఈ మార్గంలో నెలలో కనీసం 5 నుంచి 6 రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.10 లక్షలు వెచ్చించి చెరువు కట్ట ఆంజనేయస్వామి గుడి నుంచి ఐటీఐ కాలేజీ వరకు సిమెంటు రోడ్డు వేశారు. ప్రస్తుతం పట్టణంలోని చెరువు అలుగు నుంచి ఆంజనేయస్వామి గుడి మధ్య రోడ్డుపై గుంతలు పడి ప్రయాణానికి ఇబ్బందిగా ఉంది.

మార్కాపురం నుంచి తర్లుపాడు వెళ్లే సింగిల్ రోడ్డులో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితి. రాత్రిపూట ఈ రోడ్డుపై తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రోడ్డు మార్జిన్లు కూడా పూర్తిగా ధ్వంసమై గుంతలుపడ్డాయి. కొద్దిపాటి వర్షానికే ఇబ్బందికరంగా మారుతున్నాయి.

> **డబుల్ రోడ్డుగా మార్చాలి**
>
> 
>
> మార్కాపురం చెరువు కట్ట రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చి మినీ ట్యాంకు బండ్‌గా అభివృద్ధి చేయాలి. మార్కాపురం నుంచి ఒంగోలుకు వెళ్లే ప్రధానమైన రహదారి ఇదే. రోడ్లపై గుంతలుపడి రాకపోకలకు కష్టంగా ఉంది. పలకల కార్మికులు ఈ రోడ్డుపైనే వెళ్లాలి. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి రోడ్ల మరమ్మతులు పూర్తిచేయాలి.
>
> – రఫీ, సీపీఎం పట్టణ కార్యదర్శి

అధికారులు బాధ్యతగా పనిచేయాలి



వైద్యశాల సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న ఎంపీపీ తులశమ్మ



సమావేశంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ

కంభం: అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు ప్రజాసమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలకు వచ్చిన రోగులు, గర్భిణులను ఇతర వైద్యశాలలకు రిఫర్ చేయకుండా వైద్యం అందించేలా చూడాలన్నారు. అనంతరం శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ఏవైనా పనులు చేసే సమయంలో సర్పంచులు ఉన్నారన్న విషయాన్ని గుర్తించాలని చిన్న కంభం సర్పంచ్ రసూల్ పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో మరుగుదొడ్లు ఇష్టం వచ్చినట్లు నిర్మించినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నిరుపయోగంగా ఉన్న హెల్త్ క్లినిక్‌ను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ వైద్యశాలలో మంజూరై ప్రారంభానికి నోచుకోని బ్లడ్ స్టోరేజ్ కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం కోరారు. వర్షాలకు దెబ్బతిన్న పంటల నష్టాన్ని ఎందుకు అంచనా వేయలేదని పలువురు సభ్యులు ప్రశ్నించగా అంత వర్షపాతం నమోదు కాలేదని సమాధానం ఇవ్వడంపై ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. 90 శాతం పనులు పూర్తయిన సచివాలయంను ఎందుకు ప్రారంభించ లేదని ఎల్‌కోట సర్పంచ్ బాషా ప్రశ్నించారు. పట్టణంలో ప్రధాన ప్రాంతాల్లో నుంచి వెళ్లే ఇరిగేషన్ కాలువలు ఆక్రమణలకు గురయ్యాయని అధికారులు చర్యలు తీసుకోవాలని కంభం సర్పంచ్ బోడెయ్య కోరారు. రావిపాడు రోడ్డులో గతంలో ఇచ్చిన ఇంటి స్థలాలపై కొందరు కోర్టులో కేసు వేయడంతో స్తబ్దత నెలకొందని, ప్రస్తుతం వాటిలో ఇళ్లు నిర్మించుకోవాలనుకున్న వారి పరిస్థితి ఏమిటో చెప్పాలని వైస్ ఎంపీపీ రామ్మూర్తి ప్రశ్నించారు. రావిపాడులో శ్మశాన వాటిక మార్గంలో వాగు దాటాల్సి ఉందని, సమస్యను పరిశీలించాలని స్థానిక ప్రజాప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా ఏఓ స్వరూప మాట్లాడుతూ.. 2019 తర్వాత పొలాలు కొనుగోలు చేసిన వారు పీఎం కిసాన్‌కు అనర్హులని చెప్పారు. ఇరిగేషన్ కాల్వల్లో పూడికతీతకు 38 లక్షలు మంజూరయ్యాయని ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఎంపీడీఓ వీరభద్రాచారి, జెడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఓపిక లేకపాయే!

మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశంలో అధికారులు మూడు గంటల సేపు కూడా కూర్చోలేకపోవడం విమర్శలకు తావిచ్చింది. మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు ముందుగానే వచ్చి కూర్చోగా అధికారులు మాత్రం తాపీగా 11 గంటలకు వచ్చారు. ఆలస్యంగా వచ్చిన వారు సమావేశం పూర్తయ్యే వరకు వారి సీట్లలో కూర్చున్నారా అంటే అదీ లేదు సమావేశంలో మాట్లాడిన అధికారులు ఒకరిద్దరు మినహా మిగిలినవారంతా బయటకు వెళ్లి వేరే గదుల్లో, చెట్ల కింద, బయట ఉన్న టీకొట్టు వద్ద కాలక్షేపం చేయడం చర్చనీయాంశమైంది. మరి కొందరు అధికారులు సమావేశానికే ముఖం చాటేశారు.

సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శం

మార్కాపురం: సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శనీయమని బీసీ జాతీయ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా బీసీ భవన్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు గోసు సుబ్బారావు, ఐ.రంగస్వామి గౌడ్, టీపీ వెంకటేశ్వర్లు, జి.రమణ, నాగార్జున, శివప్రకాష్, రాంబాబు, నాగం రామకృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాచర్ల: మోడంవారిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సంబంధించిన లైన్ పనుల కారణంగా మండలంలోని అనుమలవీడులోని 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ బాల గురవయ్య తెలిపారు. ప్రజలు సహకరించాలని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

ప్రైవేటు స్కూల్ బస్సు బీభత్సం

మార్కాపురం: రివర్స్ చేస్తూ ప్రమాదవశాత్తు వెనుకవైపు ఉన్న మూడు ద్విచక్ర వాహనాలను ఓ ప్రైవేటు స్కూల్ బస్సు ఢీకొట్టిన సంఘటన శుక్రవారం మార్కాపురం పట్టణంలోని పెద్దనాగులవరం రోడ్డు మీనా మసీదు వద్ద జరిగింది. శుక్రవారం ఉదయం పట్టణంలోని ఓ స్కూల్ బస్సు విద్యార్థులను ఎక్కించుకునేందుకు నాగులవరం రోడ్డువైపు వెళ్తోంది. ఈ క్రమంలో ఒక మలుపు వద్ద డ్రైవర్ బస్సును రివర్స్ చేశాడు. అయితే బస్సు వెనకే ఉన్న మూడు ద్విచక్ర వాహనాలను గమనించక ఢీకొనడంతో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో గొట్లగట్టు విద్యార్థి ప్రతిభ



ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిరుత

కొనకనమిట్ల: బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో ఇటీవల నిర్వహించిన 68వ జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో రాష్ట్ర జట్టు మంచి ఉత్తమ ప్రదర్శన కనబరిచినట్లు గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల పీడీ, రగ్బీ కోచ్ వై.బాలగురవయ్య తెలిపారు. రాష్ట్ర జట్టు టాప్ 8లో నిలిచేందుకు తమ హైస్కూల్ విద్యార్థి మొలకా చిరుత కృషి చేశాడన్నారు. హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.



గృహాల్లోకి కర్రలు పెట్టుకుని నడుస్తున్న దృశ్యం

రోడ్డు విస్తరణలో సా..గదీత!

- రెండు నెలల క్రితం సీసీ రోడ్డు పనులు ప్రారంభం
- గృహాల్లోంచి బయటకు వచ్చేందుకు నానా అవస్థలు
- నిలిచిన వాహనాల రాకపోకలు
- నిత్యం రద్దీగా ఉండే రోడ్డు నిర్మాణంపై నిర్లక్ష్యం



రోడ్డు మార్జిన్‌లో సీసీ రోడ్డుపై ఉన్న డస్ట్

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు సీసీ రోడ్డు విస్తరణ పనులు నత్త నడకన సాగుతున్నాయి. పాత సీసీ రోడ్డుకు ఇరువైపులా ఒకేసారి పనులు చేసేందుకు ఎర్త్ వర్క్ కోసం గుంతలు తీయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. రెండు నెలలు దాటినా ఎర్త్‌వర్క్, సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించలేదు. ఎర్త్‌వర్క్ కోసం మట్టి తీసేటప్పుడు గృహాల ముందు కొన్ని చోట్ల మంచినీటి పైపులు పగిలిపోయాయి. అంతేకాకుండా పక్కనున్న డ్రైనేజీ కాలువ నీరు ఊటచేరింది. రెండు–మూడు రోజులు మోటార్‌తో నీటిని డ్రైనేజీలోకి వెళ్లగొట్టారు. హైస్కూల్ సమీపంలో కొంతమేర ఎర్త్‌వర్క్ కోసం డస్ట్ వేసేందుకు వారం రోజులు పట్టింది. ప్రస్తుతం ఆ పనులు కూడా నిలిపివేశారు. డస్ట్ వేయకుండా సిమెంట్ రోడ్డుపై వారం రోజులు ఉంచడంతో కనీసం ద్విచక్ర వాహనాలు కూడ వెళ్లలేని పరిస్థితి. రెండు నెలలుగా గృహాల నుంచి వయసు మళ్లినవాళ్లు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. కార్లు, స్కూల్ బస్‌లు, ట్రాక్టర్లు రాకపోకల సమయంలో ఎదురుగా ఏదైనా వాహనం వస్తే మార్జిన్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెడ్డినగర్ వాసులు, వాహనదారులు, హైస్కూల్ విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగించే రోడ్డు నిర్మాణంపై కాంట్రాక్టర్ తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం తొందరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుకు ఇరువైపులా కిరణా, సూపర్‌మార్కెట్, క్లాత్, రెడీమేడ్, పలు దుకాణాల గోడౌన్లు ఉన్నాయి. షాపుల్లోకి వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడం, కనీసం ద్విచక్ర వాహనాలు నిలుపుకొనేందుకు స్థలం లేకపోవడంతో వ్యాపారం సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోడౌన్లలోకి సామగ్రి దింపేందుకు మినీలారీలు వచ్చేందుకు అవకాశం లేకపోవడతో వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు.

> **అసౌకర్యంగా ఉంది**
>
> రోడ్డుకు ఒకవైపు సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసిన తర్వాత మరో వైపు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటే ఎటువంటి ఇబ్బంది ఉండేది కాదు. రెండు వైపులా ఎర్త్ పనుల కోసం గుంత తీయడంతో రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా మారింది. రెండు నెలలుగా పనులు పూర్తి చేయకపోవడంతో పెద్ద వాహనాలు తిరిగే పరిస్థితి లేకుండాపోయింది.
>
> – జి.భాస్కర్‌రెడ్డి, రెడ్డినగర్

> **సర్కస్ ఫీట్లు చేయలేకపోతున్నాం**
>
> నెల తరబడి రోడ్డు వేయకుండా ఇళ్ల ముందు గుంతలు తీసి వదిలిపెట్టారు. ముసలివాళ్లు ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. రోజూ ఏదో ఒక పనిమీద బయటకు వెళ్లాల్సి ఉంటుంది. కనీసం బయటి నుంచి మంచినీటి క్యాన్ తెచ్చుకోవాలన్నా సర్కస్ చేయాల్సి వస్తోంది.
>
> – రంగమ్మ, రెడ్డినగర్.

కౌన్సిలర్ భర్తకు ఘన నివాళి



కాటమయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న అన్నా రాంబాబు

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపల్ పరిధిలోని చెన్నరాయునిపల్లికి చెందిన 14వ వార్డు కౌన్సిలర్ బుర్రి ఎల్లమ్మ భర్త కాటమయ్య(45) అనారోగ్యంతో ఒంగోలులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం వేకువజామున మరణించారు. ఆయన మృతదేహానికి మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డితోపాటు పలువురు కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు.

కార్మికులకు వేతనం పెంచాల్సిందే..

- ఇంజినీరింగ్ కాంట్రాక్టు కార్మికుల ధర్నా
- సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు

మార్కాపురం టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయాలలో పనిచేస్తున్న స్కిల్డ్, సెమీ స్కిల్డ్ కాంట్రాక్టు కార్మికులకు వేతనం పెంచాలని డిమాండ్ చేస్తూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట రాష్ట్ర వ్యాప్త యూనియన్ పిలుపు మేరకు ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ.. నగర పంచాయతీలు, పురపాలక సంఘాల్లో ఇంజినీరింగ్ విభాగాలైన మంచినీటి సరఫరా, వీధి దీపాలు, టౌన్ ప్లానింగ్, మెకానిక్స్, కంప్యూటర్ ఆపరేటర్, ఆఫీస్ తదితర విభాగాల్లో కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వీరికి 2018 వరకు పారిశుధ్యకార్మికులతో పాటు వేతనం చెల్లించారని తెలిపారు. ప్రస్తుతం వారి కంటే తక్కువ వేతనం చెల్లించడం సబబేనా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇంజినీరింగ్ కార్మికులకు జీవో నంబర్ 36/01.03.24 ప్రకారం వేతనం పెంచి ఇవ్వాలన్నారు. అలాగే నిత్యం ప్రమాదకర పరిస్థితులలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు రిస్క్ అలవెన్స్, పనిముట్లు, యూనిఫాం చెల్లించాలన్నారు. ప్రమాదకర విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్ నారాయణరావుకు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.సుబ్బరాయుడు, జి.హరి, నాయకులు ఇమాంసా, చెన్నకేశవులు, శ్రీను, కనకయ్య, రమణ, శేషిరెడ్డి, శ్రీను, అల్లూరయ్య, రషీద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాసులు

మార్కాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆలిండియా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు కోరారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో ఎస్‌కేఎం బాషా అధ్యక్షతన ఆటో వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చలానాల పేరుతో కార్మికుల నుంచి అధిక మొత్తాలు వసూలు చేసే విధానాలు మానుకోవాలన్నారు. వ్యవసాయ రంగం తర్వాత ఆటో రంగంలోనే కార్మికులు ఉన్నారని, వారికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ డిమాండ్ చేశారు. ఆటో కొనుగోళ్లకు ప్రభుత్వం రుణం ఇవ్వాలని, కార్మికులకు స్టాండ్లు చూపాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్బరాయుడు, రూబెన్, నాగరాజు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు మార్కాపురం విద్యార్థిని ఎంపిక

మార్కాపురం: ఒంగోలులో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో మార్కాపురం జెడ్పీ బాలికోన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని డి.కీర్తన ప్రతిభ చాటింది. కీర్తన రూపొందించిన స్మార్ట్ పోల్ ప్రాజెక్టు ప్రథమ స్థానం పొందడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీదేవి తెలిపారు. డీఈఓ కిరణ్‌కుమార్ చేతులమీదుగా కీర్తన షీల్డ్, ప్రశంస పత్రం అందుకున్నట్లు చెప్పారు. గైడ్ టీచర్‌గా పీఎస్ఎల్ కామేశ్వరిని, విద్యార్థినిని హెచ్‌ఎంతోపాటు తెలుగు టీచర్ రవిచంద్ర తదితరులు అభినందించారు.



డీఈఓ నుంచి షీల్డ్ అందుకుంటున్న కీర్తన